ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
శనివారం 27 సెప్టెంబరు 2025

ఆర్టీసీ ప్రయాణికులకు లక్కీడ్రా

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో శనివారం నుంచి ప్రయాణించే వారి కోసం లక్కీ డ్రా పథకాన్ని ప్రవేశపెట్టినట్టు గోదావరిఖని ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం నాగభూషణం తెలిపారు. శనివారం నుంచి అక్టోబరు 6వరకు సెమిడీలక్స్, డీలక్స్, సూపర్ లగ్జరీ, మెట్రో డీలక్స్, లహరి, నాన్ ఏసీతో పాటు అన్నీ ఏసీ బస్సుల్లో ప్రయాణించే వారు బస్సు దిగేటప్పుడు టికెట్ వెనుక పేరు, చిరునామా మొబైల్ నెంబర్ రాసి బస్సులో అమర్చిన లక్కీ డ్రా బాక్స్‌లో వేయాలని సూచించారు. 8వ తేదిన సాయంత్రం 4గంటలకు కరీంనగర్‌లోని ప్రాంతీయ కార్యాలయంలో ముగ్గురు విజేతలను ఎంపిక చేస్తారని, మొదటి విజేతకు రూ.25వేలు, రెండో విజేతకు రూ.15వేలు, 3వ విజేతకు రూ.10వేల నగదు పురస్కారం ఇస్తామని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్టీసీ యాత్రదానం పథకంలో భాగంగా ఎవరైన అనాథ శరణాలయంలోని అనాథలు, వృద్ధాశ్రమంలో వృద్ధులు లేదా స్కూల్ విద్యార్థులు విహారయాత్రలకు, పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సు తీసుకెళ్లవచ్చునని, వివరాలకు 7382847596, 7013504982 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.



మద్యం టెండర్లకు నోటిఫికేషన్ జారీ

- గౌడ కులస్తులకు 13, ఎస్సీలకు 8 షాపులు కేటాయింపు
- వచ్చే నెల 18వ తేదీ వరకు టెండర్లకు గడువు
- తొలి రోజు ఆరు దరఖాస్తుల రాక

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో గల రిటెయిల్ మద్యం షాపులకు వచ్చే రెండేళ్లకుగాను టెండర్లను ఆహ్వానిస్తూ ఎక్సైజ్ శాఖాధికారులు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 18వ తేదీ సాయంత్రం వరకు దరఖాస్తులను స్వీకరించ నున్నారు. గతంలో కంటే ఈసారి దరఖాస్తు ధరను 2 లక్షల నుంచి 3 లక్షల రూపాయలకు పెంచారు. ఆయా ప్రాంతాల జనాభా ఆధారంగా జిల్లాలో నాలుగు స్లాబు ల్లో షాపులు ఉన్నాయి. గ్రామాలు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ ఉన్న దృష్ట్యా నాలుగు స్లాబులు వర్తించనున్నాయి. ఆ మేరకు మద్యం షాపులను దక్కిం చుకునే వాళ్లు లైసెన్స్ పీజు చెల్లించాల్సి ఉంటుంది. 5 వేల లోపు జనాభా గల షాపులకు ఏడాదికి 50 లక్షల రూపాయలు, 5001 నుంచి 50 వేల జనాభా ఉన్న ప్రాంతాల్లోని షాపులకు 55 లక్షలు, 50001 నుంచి లక్ష వరకు జనాభా ఉన్న ప్రాంతాల్లోని షాపులకు 60 లక్షలు, లక్ష నుంచి 5 లక్షల వరకు జనాభా ఉన్న ప్రాం తాల్లోని షాపులకు 65 లక్షలు, 500001 నుంచి 20 లక్షల వరకు జనాభా ఉన్న ప్రాంతాల్లోని షాపులకు 85 లక్షల రూపాయల పీజు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. మద్యం షాపులను దక్కించుకునే వాళ్లు మొదటి వాయిదా లైసెన్స్ పీజులో 6వ వంతు డబ్బు లను వచ్చే నెల 23వ తేదీ వరకు చెల్లించాలి. మద్యం షాపులను దక్కించుకునే నిర్వాహకులు డిసెంబర్ 1వ తేదీ నుంచి 2027 నవంబర్ 30వ తేదీ వరకు వాటిని నిర్వహించాల్సి ఉంటుంది. 2023లో నిర్వహించిన టెం డర్ల ద్వారా 77 షాపులకు 2022 దరఖాస్తులు రాగా, 40 కోట్ల 44 లక్షల రూపాయల ఆదాయం వచ్చింది.

● గౌడ కులస్తులకు కేటాయించిన 13 షాపుల్లో డ్రా ద్వారా ఎంపిక చేసిన షాపుల్లో పెద్దపల్లి పట్టణంలోని గెజిట్ నంబర్ 1 షాపు, గెజిట్ నంబర్ 5, సుల్తానాబాద్‌లోని గెజిట్ నంబర్ 22, కాల్వశ్రీరాంపూర్‌లోని గెజిట్ నంబర్ 27, గెజిట్ నంబర్ 28 షాపులు, కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లిలోని

(మిగతా 8వ పేజీలో)

● జిల్లాలో 74 మద్యం షాపులు..

జిల్లాలో 74 రిటెయిల్ మద్యం షాపులున్నాయి. ఈసారి మూడు షాపులు తగ్గాయి. గౌడ కులస్తులకు 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం మద్యం షాపులను కేటాయించాల్సి ఉంది. ఆ మేరకు గౌడ కులస్తులకు కేటాయించిన 13 షాపులు, ఎస్సీలకు 8 షాపులను, మొత్తం 21 షాపులను గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష డ్రా ద్వారా ఎంపిక చేశారు. మిగతా 53 షాపులకు ఎవరైనా టెండర్లు వేసుకునే అవకాశం ఉంటుంది.

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

● రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు



శ్రీమహాలక్ష్మి ఆలయంలో భజన చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహాలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమశాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ఆకాక్షించారు. దేవీ శర్నవరాత్రుల్లో భాగంగా మహాలక్ష్మి అమ్మవారిని మంత్రి శ్రీధర్‌బాబు శుక్రవారం ఉదయం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లలితదేవీ ఆలయంలో హోమం, షిర్డీ సాయిబాబా ఆలయాలను సందర్శించారు. పోచమ్మవాడ, గాంధీచౌక్, వాగుగడ్డ, శ్రీపాదకాలనీ, సూరయ్యపల్లి ప్రాంతాల్లోని దుర్గా భవాన్ని విగ్రహాలను దర్శించుకున్నారు. మహాలక్ష్మి ఆలయంలో అర్చకులు ఆర్వచనం ఇచ్చి సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలంతా అమ్మవారి దీవెనలతో ఆరోగ్యంగా, సుఖశాంతులతో ఉండాలని, పాడి పంటలు మంచిగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

రైతులు సాగు వివరాలను నమోదు చేసుకోవాలి

పెద్దపల్లి, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతీ రైతు పంటల వివరాలను వ్యవసాయవిస్తరణ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రతీ రైతు వారి క్లస్టర్ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారిని కలిసి ప్రస్తుత వానాకాలం సీజన్‌లో సాగు చేస్తున్న పంటల వివరాలను ఎటువంటి పొరపాట్లు లేకుండా నమోదు చేసుకోవాలని అన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో తిరుగుతూ పంటల సాగు వివరాలు క్రాఫ్ బుకింగ్ చేసుకుంటున్నారని, ప్రతీరైతు వ్యవసాయ విస్తరణ అధికారులకు సహకరిస్తూ వారిని కలిసి సాగు చేస్తున్న పంట వివరాలు చెక్ చేసుకోవాలన్నారు. లేకుంటే పంట విక్రయ సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటారని, ఈ అంశాన్ని రైతులు గమనించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఆప్రకటనలో పేర్కొన్నారు.

బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి



సెంట్రల్ లైటింగ్‌ను ప్రాంభిస్తున్న ఎమ్మెల్యే

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) సద్దుల బతుకమ్మ, దసరా పండుగలకు ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అధికారులను సూచించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎంపీడీఓలు, ఎంపీవోలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. బతుకమ్మ ఆడే ప్రాంతాల్లో, నిమజ్జనం చేసే స్థలాలు చదును చేసి, లైటింగ్, ఇతర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. పండుగల సందర్భంగా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. చందపల్లిలో అమృత్ పథకం కింద వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరాకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. పెద్దపల్లి కోర్టు నుంచి కలెక్టరేట్ వరకు సెంట్రల్ లైటింగ్ సిస్టంను ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రజా సంక్షేమం కోసం పని చేసే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, ఎంపిడిఓలు, ఎంపిఓలు, అధికారులు, నాయకులు, పాల్గొన్నారు. కంచర బావి వద్ద చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పించారు.



సింగరేణి కార్మికులకు డబుల్ బొనంజా

- దసరాకు లాభాల వాటా
- దీపావళికి బోనస్

గోదావరిఖని, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు దసరా, దీపావళి బొనంజా నెలకొంది. దసరా, దీపావళి సందర్భంగా 40వేల కార్మిక కుటుంబాలకు లాభాల వాటా, బోనస్‌లు అందనున్నాయి. ప్రభుత్వ రంగంలో ఏ పరిశ్రమలో లేని విధంగా సింగరేణి కార్మిక వర్గం రెండు దశాబ్దాలుగా పొందుతున్నారు. లాభాల వాటా 34శాతానికి పెరిగి వేల నుంచి లక్ష రూపాయలు కార్మికులకు అందుతున్నాయి. సంస్థ లాభాలు పెరుగుతున్న కొద్ది కార్మికులకు వాటాశాతం పెరగడంతో పాటు ఆర్థిక ప్రయోజనం పెరుగుతోంది. 10శాతంతో ప్రారంభమైన లాభాల వాటా ఇప్పుడు 34శాతానికి పెరిగింది. 2000సంవత్సరం రూ.300 కోట్ల లాభాలు ఉన్న సింగరేణి ఇప్పుడు రూ.6వేల కోట్ల లాభాలను ఆర్జిస్తున్నది. ఈ సంవత్సరం సింగరేణి కార్మికుల లాభాల వాటా రూ.800కోట్లు కేటాయించగా ఒక్కో కార్మికుడికి సరాసరి రూ.2లక్షలు. ఈ నెలాఖరున దసరా డబ్బులు కార్మికుల ఖాతాల్లో జమ అవుతాయి. సెప్టెంబరుకు సంబంధించిన సింగరేణి కార్మికుల వేతనాలు రూ.400కోట్లపైబడి ఉంటాయి. దసరా అడ్వాన్స్ రూ.25వేల చొప్పున రూ.100కోట్లు కార్మికుల ఖాతాల్లో కేవలం పది రోజుల్లోనే జమ కానున్నాయి. అంటే మొత్తం 40వేల మంది సింగరేణి కార్మికులకు రూ.1300కోట్లు పది రోజుల్లోనే ఖాతాల్లో జమకానున్నాయి. అక్టోబరులో వేతనాలు రూ.400కోట్లతో పాటు పీఎల్ఆర్ బోనస్ అంటే దీపావళి బోనస్ మరో రూ.400కోట్లు నెల రోజుల్లోనే రూ.800కోట్లు కూడా సింగరేణి కార్మికుల ఖాతాల్లో జమ అవుతాయి. సరాసరిగా ఒక్కో కార్మికుడికి రూ.5లక్షల నుంచి రూ.8లక్షల వరకు ఆర్థిక ప్రయోజనం జరుగుతుంది. 40వేల కుటుంబాల్లో ఈ ఆర్థిక వెసులుబాట పండుగ వాతావరణాన్ని ఏర్పాటు చేయనున్నది.

కొత్త బట్టలు, కార్లు, ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేయనున్నారు. కోల్‌బెల్ట్ ప్రాంతంలోని పది జిల్లాల్లో ఈ ఆర్థిక ప్రభావం కనిపించనున్నది. సింగరేణి పర్మినెంట్ కార్మికులకే కాకుండా సంస్థలో పని చేస్తున్న 30వేల కాంట్రాక్టు కార్మికులకు సైతం దసరా బోనస్‌గా ఒక్కొక్కరికి రూ.5,500 చెల్లిస్తున్నది. ఇది చిన్న మొత్తమైనా 30వేల మందికి రూ.16.5కోట్లు లబ్ధి జరుగనున్నది. కోల్‌బెల్ట్ ప్రాంతంలో, పరిసర గ్రామాల్లో నాలుగైదు లక్షల మంది ఉల్లాసంగా, ఉత్సాహంగా పండుగను జరుపుకునే వాతావరణం ఏర్పడింది. ఆర్థిక వెసులుబాటుకు తోడు సాంస్కృతిక శోభను సంతరించుకునే తొమ్మిది రోజుల సద్దుల బతుకమ్మ సంబరాలు, దుర్గాదేవి శరన్నవరాత్రులు కోల్‌బెల్ట్‌లో కొత్త ఉత్తేజాన్ని ఏర్పాటు చేశాయి.

29న లాభాల వాటా అందజేత

గోదావరిఖని, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు ఈ నెల 29న యాజమాన్యం లాభాల వాటాను చెల్లించనున్నది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి వచ్చిన లాభాల్లో రూ.819కోట్లు 40వేల మంది సింగరేణి కార్మికులకు రానున్నాయి. లాభాల్లో 34శాతం కార్మికులకు వాటా చెల్లిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం ప్రకటించింది. ఈ లాభాల వాటా ఒక్కో కార్మికునికి సరాసరిన రూ.1.97లక్షలు రానున్నాయి. పర్మినెంట్ కార్మికులతో పాటు సింగరేణిలో పని చేస్తున్న 30వేల మంది కాంట్రాక్టు కార్మికులకు కూడా లాభాల్లో భాగస్వామ్యం కల్పించారు. ప్రతి కాంట్రాక్టు కార్మికుడికి రూ.5,500 ప్రకటించింది. అయితే ఈ బోనస్‌ను కాంట్రాక్టు కార్మికులకు ఎప్పుడు జమ చేస్తారనే విషయం యాజమాన్యం ఇప్పటికీ స్పష్టతనివ్వలేదు.

పత్తి రైతులకు కనీస మద్దతు ధర అందించాలి
● సమీక్ష సమావేశంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష 8

పోస్టులు లేకున్నా... పదోన్నతులు..

- పోలీస్‌శాఖలో గందరగోళం...
- కాళేశ్వరం జోన్‌లో 70మందికి అదనంగా పదోన్నతులు
- వేతనాల చెల్లింపులపై ఫైనాన్స్ విభాగం అభ్యంతరం...

కోల్‌సిటీ, సెప్టెంబరు 26(ఆన్‌లైన్): పోలీస్‌శాఖలో పోస్టులు మంజూరు లేకున్నా పదోన్నతులు ఇచ్చారు.. కాళేశ్వరం జోన్‌లో 70మందికి ఈ రకంగా పదోన్నతులు కల్పించారు. ములుగును కొత్త జిల్లాగా ఏర్పాటు చేసినా పోలీస్‌శాఖ నుంచి అదనపు పోస్టులు మంజూరు చేయలేదు. కానీ కాళేశ్వరం జోన్‌లో సివిల్, ఏఆర్ కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా, ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లను ఏఆర్ఎస్ఐలుగా పదోన్నతులు కల్పించారు. రామగుండం కమిషనరేట్‌లో పని చేసే వారిలోనే ఎక్కువమంది పదోన్నతులు పొందారు. పదోన్నతులు పొందిన వారు వేతనాలు పొందుతుండగా వారిని ములుగు జిల్లాకు బదిలీ చేశారు. మొదట అక్కడ వెకెన్సి రిజర్వులో ఉంచి తరువాత వివిధ పోలీస్‌స్టేషన్లకు కాళేశ్వరం జోన్ పరిధిలోని వివిధ జిల్లాల పోలీస్‌స్టేషన్‌లకు అటాచ్‌మెంట్లు ఇచ్చారు. ఇటీవల పోలీస్‌శాఖలోని ఫైనాన్స్ విభాగం వేతనాల విషయంలో అభ్యంతరాలు తెలుపడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పదోన్నతులు పొందిన వారికి సంబంధించి పోస్టులమంజూరు జీవో పంపాలంటూ ఫైనాన్స్ విభాగం కాళేశ్వరం జోన్ అధికారులకు లేఖ పంపడంతో అసలువిషయం వెలుగులోకి వచ్చింది. కాళేశ్వరం జోన్ పరిధిలో ములుగు, జయశంకర్ భూపాల పల్లి, పెద్దపల్లి, మంచిర్యాల, కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలు ఉన్నాయి. కాళేశ్వరంజోన్ ఏర్పాటైన తరువాత రిటైర్‌మెంట్లు, పదోన్నతులతో ఏర్పడిన ఖాళీలను కింది సిబ్బందికి పదోన్నతులు ఇచ్చి భర్తీచేస్తున్నారు. కాళేశ్వరం జోన్‌లో 2004, 2009 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్లకు పదోన్నతులు లభించాయి. రాజన్న సిరిసిల్లా జోన్‌లో 1995-96 బ్యాచ్ కానిస్టేబుళ్లకు పదోన్నతులు లభించగా కాళేశ్వరం జోన్‌లో 2009 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్లకు పదోన్నతులు వచ్చాయి.

పోస్టులు మంజూరు కాకుంటే పదోన్నతులు రద్దే..

ములుగు జిల్లాగా ప్రకటించినప్పుడు వివిధ విభాగాలకు అదనపు పోస్టులు మంజూరు చేయాల్సి ఉంటుంది. అలా చేయకపోవడం వల్లే ఈ సమస్య ఉత్పన్నమైనట్టు తెలుస్తున్నది. ఫైనాన్స్ విభాగం పోస్టుల మంజూరు జీవో పంపాలని పేర్కొనడంతో ఇప్పుడు గందరగోళం నెలకొన్నది. కొత్తగా పోస్టులు మంజూరు చేయడం లేదా పదోన్నతులు పొందిన వారికి యథావిధిగా వేతనాలు ఇచ్చేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడమే మార్గంగా తెలుస్తున్నది. ప్రభుత్వం పోస్టులు మంజూరు చేయకపోతే సుమారు 70మంది పదోన్నతులు రద్దు అయి రివర్షన్ అయ్యే ప్రమాదం ఉంది.


ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం...

చంద్రశేఖర్‌రెడ్డి, ఐజీ, మల్టీజోన్-1

కాళేశ్వరం జోన్‌లో పదోన్నతుల విషయంలో కొంత ఇబ్బంది ఏర్పడింది. ఖాళీలు ఏర్పడిన కొద్ది పదోన్నతులు ఇచ్చి భర్తీ చేశారు. కొత్త జిల్లాకు పోస్టులు మంజూరులో జాప్యం వల్లే ఈ సమస్య ఏర్పడింది. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.



చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం
● నివాళులర్పించిన రజక సంఘం నాయకులు 8









రూ.6200 పలికిన పత్తి ధర

జమ్మికుంట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌యార్డులో క్వింటాల్ పత్తి ధర రూ.6200 పలికింది. శుక్రవారం మార్కెట్‌యార్డుకు 33మంది రైతులు 168క్వింటాళ్ల కొత్త విడిపత్తి, 28మంది రైతులు 39క్వింటాళ్ల కొత్త పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వార గరిష్ఠ ధర రూ.6200, కనిష్ఠ ధర రూ.3500 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

29న ఇసుక వేలం పాట

కోల్‌సిటీ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన 155ట్రిప్పుల ఇసుకకు ఈ నెల 29న రామగుండం తహసీల్దార్ కార్యాలయంలో వేలం నిర్వహించనున్నట్టు రామగుండం తహసీ ల్దార్ ఈశ్వర్‌ప్రసాద్ తెలిపారు. శ్రీనగర్‌కాలనీలో 30ట్రిప్పులు, పవర్‌హౌస్‌కాలనీ లోని జీపీ ఫంక్షన్‌హాల్‌లో 15ట్రిప్పులు, రంగనాథస్వామి ఆలయ ఆవరణలో 80ట్రిప్పులు, అడ్డగుంటపల్లి సగరవీధిలో 30ట్రిప్పులను గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఈనెల 9న స్వాధీనం చేసుకున్నారు. ఈ ఇసుకను ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేలం వేయనున్నట్టు తెలిపారు. రూ.5వేల ధరావత్తు కట్టాలని, వేలంలో పాల్గొనే వారు ఐటీ రిటర్న్ కాపీ సమర్పించాలని తెలిపారు. పాటలో దక్కించుకున్న వారు 24గంటలలోపు డబ్బులు చెల్లించి ఇసుకను స్వాధీనం చేసుకోవాలని సూచించారు. క్యూబిక్ మీటర్‌కు రూ.560, సీనరేజ్ ఫీజు రూ.40, డీఎంఎఫ్‌టీ 30శాతం, సీనరేజ్ ఫీ 2శాతం ఉంటుందని పేర్కొన్నారు.

జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు గురుకుల విద్యార్థి


వేణు

కరీంనగర్ స్పోర్ట్స్/మానకొండూర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ మండలంలోని దేవంపల్లి గురుకుల పాఠశాలకు చెందిన వేణు అనే విద్యార్థి జాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక అయ్యాడు. ఈ నెల 13నుంచి 15వరకు జన గామ జిల్లాలోని కోనూరులో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో వేణు అత్యుత్తమ ప్రదర్శన కనమర్చి తృతీయస్థానం సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. తమిళనాడు రాష్ట్రంలోని దిండిగల్ జిల్లాలో ఈ నెల 26నుంచి 28వరకు జరిగే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రస్థాయి జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడు. కాగా శుక్రవారం వేణును పాఠశాల ప్రిన్సిపాల్ జగన్నాథం, వైస్ ప్రిన్సిపాల్ కొమురయ్య, జూనియర్ ప్రిన్సిపాల్ రేణుక, అధ్యాపకులు అశోక్‌రెడ్డి, శివప్రసాద్, మనోహర్, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రవీణ్, శివప్రసాద్ విద్యార్థిని సన్మానించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పెగడపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలంలోని అయిత్‌పల్లి శివారులో శుక్రవారం ఎనిమిది మంది పేకాటరాయుళ్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. గ్రామ శివారులోని మామిడితోటలో పేకాడుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడిచేసి వారి వద్ద నుంచి రూ.3,950నగదు, ఆరుసెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అనంతగిరి గ్రామంలో పిడుగులు

● రెండు ఆవులు మృతి.. ● గృహోపకరణాలు దగ్ధం


మృతిచెందిన ఆవు వద్ద రోదిస్తున్న రైతు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతగిరి గ్రామంలో ఒకే రోజు మూడు పిడుగులు పడ్డాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఆవులను అన్నపూర్ణ రిజర్వాయర్ కట్ట వద్దకు వల్లంపట్ల పర్శరాం అనే తీసుకవెళ్లగా పిడుగుపాటుతో రెండు ఆవులు మృతిచెందాయి. దాదాపు రూ 70వేల నష్టం వాటిల్లింది. ఇదే గ్రామానికి చెందిన తిప్పారపు రాజేశం, చింత కింది మల్లేశంల ఇళ్లపై పిడుగులు పడటంతో గృహోపకరణాలు దగ్ధం అయ్యాయి. ఇంట్లోని వారెవరికి ప్రమాదం జరుగలేదు. పిడుగుపాటు వల్ల నష్టపోయిన తమను ఆదుకోవాలని బాధితులు కోరారు. ప్యాక్స్ మాజీ చైర్మన్ ఐరెడ్డి మహేందర్‌రెడ్డి బాధితులను పరామర్శించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకవెళతానని హామీ ఇచ్చారు.

స్థానిక రిజర్వేషన్లు సక్రమంగా జరగలేదు



● చీఫ్ సెక్రెటరీకి చొప్పదండి ఎమ్మెల్యే ఫిర్యాదు
● మళ్లీ జరిపించాలని కోరుతూ లేఖ
● రాజకీయవర్గాల్లో కలకలం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు స్థానాలను రిజర్వు చేసే ప్రక్రియ కరీంనగర్, జగిత్యాల జిల్లాలో సరిగా జరుగ లేదనే ఆరోపణలు వస్తున్నాయని అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. ఈ ప్రక్రియను తిరిగి జరిపించాలని కోరారు. ఈ సంఘటన రాజకీయవర్గాల్లో కలకలం సృష్టిస్తున్నది. చొప్పదండి నియోజకవర్గంలోని చొప్పదండి, రామడుగు, గంగాధర, బోయినపల్లి, మల్యాల, కొడిమ్యాల మండలాలు కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో ఉన్నాయి. జగిత్యాల, కరీంనగర్ జిల్లాల్లో నిర్వహించిన రిజర్వేషన్ల ప్రక్రియలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు న్యాయం జరుగలేదని ఆరోపణలు వస్తున్నాయని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

రిజర్వేషన్ల విషయంలో కానీఇతరత్రా ఎన్నికల నిర్వహణలో కాని విపక్షాల నుంచి ఆరోపణలు రావడం సహజం. అధికార పార్టీకి చెందిన ఒకఎమ్మెల్యేనే రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఈ విషయమై ఫిర్యాదుచేస్తూ లేఖ రాయడంతో చర్చ ప్రారంభమైంది. తిరిగి రిజర్వేషన్ ప్రక్రియను నిర్వహించాలని కోరడంతో అసలు ఈ జిల్లాల్లో అధికార యంత్రాంగం ఏవిధంగా వ్యహరిం చిందని ఈ ప్రాంతవాసులు చర్చించుకుంటు న్నారు. ఈ పరిణామాన్ని ఆసక్తిగా గమనిస్తున్న విపక్షాలు ఇందులో నిజంగానే ఎవరైనా జోక్యం చేసుకున్నారా... ఎవరికి లాభం జరిగే విధంగా రిజర్వే షన్లను ఖరారు చేశారు లేక ఎమ్మెల్యేకు వచ్చిన ఫిర్యాదులు వాస్తవమైనవేనా అనేఅంశాలు పరిశీలిస్తున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యే లేఖ రాసిన నేపథ్యంలో ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుంది అన్నది ఆసక్తికరంగా మారింది.

శనివారం సాయంత్రంలోగా ఎన్నికల నోటి ఫికేషన్ వస్తుందని వార్తలు వస్తున్న సమయంలో రిజర్వేషన్ ప్రక్రియ సరిగా చేయ లేదని, ఆయావర్గాలు న్యాయం జరగలేదని ఆరోపణలు రావడంతో వీటిలో ఏమైనా మార్పు ఉంటుందా.. నోటిఫికేషన్‌కు ముందే రిజర్వేషన్ స్థానాలను ప్రకటించాలి కదా అని అందరూ అనుకుంటున్నారు. ఒకవేళ ఈ రిజర్వేషన్లను ప్రభుత్వం నిజంగానే తప్పుపట్టి తిరిగి రిజర్వేషన్ ప్రక్రియను చేపట్టే పక్షంలో ఈ జిల్లాల్లో రేపు నోటిఫికేషన్ వెలువడుతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



● నేడు స్థానిక సంస్థల రిజర్వేషన్ల ప్రక్రియ

గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీల ఎన్నికల రిజర్వేషన్ల ప్రక్రియను శనివారం నిర్వహిస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల రిజర్వేషన్ల ప్రక్రియ సంబంధిత మండల పరిషత్ కార్యాలయాల్లో ఎంపీడీవోల సమక్షంలో 11 గంటలకు నిర్వహిస్తారన్నారు. సర్పంచ్, ఎంపీటీసీల రిజర్వేషన్లను ఆర్డీవోల ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయాల్లో మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహిస్తారని తెలిపారు. జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాల రిజర్వేషన్ల ప్రక్రియను కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ ఆధర్యంలో 12 గంటలకు నిర్వహిస్తారన్నారు. జాతీయ, గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

దొంగతనానికి యత్నం.. పట్టుకున్న పోలీసులు

శంకరపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో దొంగతనానికి యత్నించిన మహిళలను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామాల్లో ప్లాస్టిక్, పనికిరానిసీసాలు ఇతర వస్తువులను సేకరించేందుకు సంచులు పట్టుకొని తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసుకుంటున్నారు. తాళాలు పగలగొట్టి దొంగతనం చేయడానికి ప్రయత్నించిన హుజూరాబాద్‌కు చెందిన తూర్పాటి రేణుక, తూర్పాటి సమ్మక్కను పట్టుకొని స్టేషన్‌కు తరలించి కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శేఖర్ రెడ్డి తెలిపారు.

గన్నేరువరం కేంద్రంగా బ్రిడ్జి నిర్మించాలి

● మూడు మండలాల ప్రజల డిమాండ్

గన్నేరువరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మానేరునదిపై బ్రిడ్జి నిర్మాణం గన్నేరువరం కేంద్రంగా నిర్మించాలని గన్నేరువరం గ్రామప్రజలు, అఖిలపక్ష నాయకులు, బ్రిడ్జి జేఏసీ నాయకులు డిమాండ్ చేస్తూ శుక్రవారం మండల కేంద్రంలో సంతకాల సేకరణ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిడ్జినిర్మాణం గన్నేరువరం శివారులోని ఆదిహనుమాన్ ఆలయంనుంచి ఎలగందులవరకు లేదా యాస్వాడ మీదుగా నిర్మిస్తే జిల్లా కేంద్రానికి దూరభారం భారీగా తగ్గుతుందని అన్నారు. దీంతో గన్నేరువరం, బెజ్జంకి, ఇల్లంతకుంట మూడు మండలాల ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని అన్నారు. ఈమేరకు గ్రామప్రజల అభిప్రాయంపై సంతకాల సేకరణ నిర్వహించారు. మెజారిటీ ప్రజలు గన్నేరువరం కేంద్రంగా బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్నారని అన్నారు. ప్రజల అభిప్రాయానికి అనుగుణంగా బ్రిడ్జి నిర్మించేందుకు ఉద్యమాన్ని సైతం చేపడతామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పుల్లెల లక్ష్మణ్, జువ్వాడి మన్‌మోహన్‌రావు, బ్రిడ్జిజేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్, బ్రిడ్జి సాధనసమితి అధ్యక్షుడు పుల్లెల జగన్మోహన్, గంపవెంకన్న, పుల్లెలరాము, చింతలశ్రీధర్‌రెడ్డి, సుధాకర్, వెంకటేశ్వర్, అనిల్, తిరుపతిగౌడ్, ప్రవీణ్, శ్రీనివాస్, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా అనాథాశ్రమం

● నిర్వాహకుడిపై కేసు నమోదు

కోల్‌సిటీ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పట్టణంలో ప్రభుత్వ అనుమతి లేకుండా అనాథ ఆశ్రమం నిర్వహిస్తూ పిల్లలను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఫిర్యాదుపై మంథని డివిజన్ హ్యాండిక్యాప్డ్ వెల్ఫేర్‌సొసైటీ (ఎండీహెచ్‌డబ్ల్యూఎస్) అధ్యక్షుడు పోచంపల్లి రాజయ్యపై గురువారం కేసునమోదు చేసినట్టు గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. జిల్లా చైల్డ్ ప్రొటక్షన్ అధికారి నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. పిల్లలకు సంబంధించిన అనాథ ఆశ్రమాలు నిర్వహించాలంటే చైల్డ్‌కేర్ ఇన్‌స్టిట్యూషన్(సీసీఐ) సర్టిఫికెట్ పొందాల్సి ఉంటుంది. మహిళా శిశుసంక్షేమశాఖ ఈ సర్టిఫికెట్‌ను జారీ చేస్తుంది. 2023లో అధికారులు రాజయ్యకు చెందిన ఆశ్రమాన్ని నిబంధనల ప్రకారం లేదని మూసివేశారు. అప్పుడు ఏడుగురు పిల్లలను వారి బంధువులకు అప్పగించి ప్రభుత్వంనుంచి అందాల్సిన సంక్షేమ పథకాలను అందించారు. కానీ రాజయ్య మళ్లీ ప్రభుత్వ అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఆశ్రమాన్ని నిర్వహిస్తూ మళ్లీ ఆ పిల్లలను ఆశ్రమంలో పెట్టి నిబంధనలకు విరుద్ధంగా విరాళాలు సేకరిస్తున్నాడని, ఆ పిల్లలను మోకాళ్లపై కూర్చోబెట్టి నిరసనల పేర ఇబ్బందులకు గురి చేస్తున్నట్టు జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ నిర్మల వన్‌టౌన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నది. ఈ మేరకు రాజయ్యపై బీఎన్‌ఎస్ 142, జువెనల్ జస్టిస్ యాక్ట్ 41 రెడ్ విత్ 42 కింద కేసులు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. కాగా రాజయ్య ఇటీవల కలెక్టర్ శ్రీహర్ష, జిల్లా సంక్షేమాధికారిపై అవినీతి ఆరోపణలు చేశారు. ఈ పరిస్థితుల్లో రాజయ్యపై విచారణ జరుగడం, కేసు నమోదు కావడం గమనార్హం.

యువకుడి మృతదేహం లభ్యం

● వారం రోజుల క్రితం అదృశ్యం
● ప్రమాదవశాత్తు బైక్‌తో ఒర్రెలో పడినట్లు అనుమానం

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి మండలం కాట్నపల్లికి చెందిన లింగంపెల్లి విశ్వతేజ(23) ఈనెల 18న అదృశ్యమవగా మృతదేహం కొత్తపల్లి శివారులోని ఒర్రె నీటిలో చెట్టుకు తట్టుకొని ఉన్నట్లు శుక్రవారం గుర్తించారు. కొత్తపల్లి పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... విశ్వతేజ మూడునెలల నుంచి కాట్నపల్లి నుంచి కొత్తపల్లి మండలం ఎలగందులలో లాండ్ సర్వేయర్ శిక్షణ కోసం నిత్యం బైక్‌పై వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేవాడు. ఈనెల18న ఉదయం 9:30గంటలకు బైక్‌పై ఎలగందులకు బయల్దేరాడు. సాయంత్రం 5గంటలకు కుటుంబ సభ్యులు ఫోన్‌చేయగా స్విఛాఫ్ వచ్చింది. రాత్రి అయినా విశ్వతేజ ఇంటికి రాలేదు. విశ్వతేజ స్నేహితుడు చందుకు తల్లిదండ్రులు ఫోన్‌చేయగా శిక్షణ లేనందున 12:30 గంటలకే ఇంటికి వెళ్తున్నట్లు చెప్పాడని తెలిపాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటినుంచి కుటుంబసభ్యులు విశ్వతేజ కోసం కాట్నపల్లి నుంచి ఎలగందుల వరకు రోడ్డు మార్గంలో వెతికినా ఆచూకీ లభించలేదు.. శుక్రవారం మధ్యాహ్నం 12:30గంటల సమయంలో కొత్తపల్లి శివారులోని ఒర్రెలో నీటిలో చెట్టుకు తట్టుకొని విశ్వతేజ మృతదేహం కనిపించింది. అక్కడే బైక్‌కూడా లభించింది. రోడ్డుపై బ్రిడ్జి సరిగా కనిపించక బైక్‌తోసహా నీటిలో పడి ఉంటాడని, ఈత రాక మునిగి చనిపోయినట్లు భావిస్తున్నామని మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

బహ్రెయిన్‌లో వలస జీవి హఠాన్మరణం

● కంచర్లలో విషాదం


హన్మంతు(ఫైల్)

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధి నిమిత్తం బహ్రెయిన్ దేశానికి వలస వెళ్లిన వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామానికి చెందిన దేవోళ్ల హన్మంతు(36) గుండెపోటుతో హఠాన్మరణం చెందాడు. దీంతో గ్రామంలో శుక్రవారం విషాదం అలుముకుంది. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం మేరకు.. హన్మంతు స్థానికంగా దినసరి కూలీ పనులు చేస్తూ కుటుంబీకులను పోషించేవాడు. యేడాదిన్నర కిందట ఉపాధి కోసం బహ్రెయిన్ దేశానికి వలస వెళ్లాడు. రోజులాగే పనులు ముగించుకుని గదికి చేరుకున్న హన్మంతు ఛాతిలో నొప్పి అంటూ కుప్పకూలాడు. తోటిమిత్రులు ఆసుపత్రికి తరలించేలోపే అప్పటికే మృతిచెందాడని అక్కడి వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య సుమలత, కూతుళ్లు హిందు, ప్రత్యూష ఉన్నారు. కాగా మృతదేహన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేలా ప్రభుత్వం కృషి చేయడంతోపాటు బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో ముగ్గురికి తీవ్ర గాయాలు


గాయపడిన యువకుడు

జ్యోతినగర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ క్రష్షర్ నగర్‌లో శుక్రవారం విద్యుత్ తీగలు తెగి పడడంతో శివకుమార్, గణేష్, నరేష్ అనేముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఇంటికి సంబంధించిన విద్యుత్‌తీగలను సరిచేసే క్రమంలో హైటెన్షన్ తీగలకు వైర్లు కలవడంతో అవి తెగి కింద పడ్డాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయ పడిన యువకులను గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు. శివకుమార్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఎన్టీపీసీ పోలీసలు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

జ్యోతినగర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీలోని విశాల్ మార్ట్ సమీప రాజీవ్ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రామగుండంకు చెందిన ఇబ్రహీం అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. రామగుండం నుంచి గోదావరిఖని వైపు బైక్‌పై వెళ్తున్న క్రమంలో ముందుగా వెళ్తున్న మరో వాహనాన్ని ఢీకొనడంతో అదుపు తప్పి కింద పడ్డాడు. గాయపడిన ఇబ్రహీంను గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే అతని పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. ఎన్టీపీసీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పండుగ పూట పస్తులేనా..

ఉపాధిహామీ కూలీలకు నాలుగు నెలలుగా అందని వేతనాలు



ఓదెల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీలు వేతనాల కోసం ఎదురుచూస్తున్నారు. సద్దుల బతుకమ్మ, దసరా పండుగలు వస్తున్నందున వేతనాలు చెల్లించాలని కోరుతున్నారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీలో నాలుగు నెలల క్రితం ఈజీఎస్ ద్వారా ఉపాధి పనులను నిర్వహించారు. అయినా కూడా ఏ గ్రామంలో కూలీలకు డబ్బులు చెల్లించలేదు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైనప్పటికీ కూలీలకు చెల్లింపులు జరగలేదు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగు నెలల క్రితమే ఉపాధికూలీల ఖాతాలోకి డబ్బులను జమ చేయాల్సి ఉండగా చేయలేదు. మండలంలోని గ్రామాల్లో మొత్తం 11,733 జాబ్ కార్డు ఉండగా, ఇందులో 10 వేలకు పైగా కూలీలకు చేసిన కష్టానికి డబ్బులు చెల్లించాల్సి ఉంది. రోజు కూలి చేస్తేనే పూట గడిచే కూలీలు మండలంలో ప్రతి గ్రామంలో ఉన్నారు. నాలుగు నెలలు పనిచేసిన కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీరిని కనికరించడం లేదని ఆరోపిస్తున్నారు.

రెండు రోజుల్లో చెల్లించకుంటే కార్యాలయాన్ని ముట్టడిస్తాం

ఆవుల ముత్తయ్య, మాజీ ఎంపీటీసీ మడక



ఉపాధిహామీ కూలీలకు వేతనాలు చెల్లించాలి. అధికారులు స్పందించి రెండు రోజుల్లో కూలీలందరికీ డబ్బులు చెల్లించాలి, లేకుంటే కూలీలతో మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తాం.

వర్షానికి కూలిన ఇల్లు

హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల మూలంగా మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన ముప్పు స్వామి అనేవ్యక్తి ఇల్లు కూలిపోయింది. గురువారం రాత్రి కురిసిన వానకు గోడలు పూర్తిగా నానిపోగా గోడ కూలి పోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. అధికారులు స్పదించి తన కుటుంబాన్ని ఆదుకోవాలన్నాడు.


కూలిన ఇల్లు

అసత్య ప్రచారాలకే పరిమితమైన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

● ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

హుజూరాబాద్/జమ్మికుంట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోకుండా అసత్య ప్రచారాలకే ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి పరిమితమయ్యాడని, ఆయన తన వైఖరి మార్చుకోవాలని ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూరి వెంకట్ అన్నారు. శుక్రవారం ఆయన హుజూరాబాద్, జమ్మికుంటలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులు విడుదల చేస్తే అది తన ఘనతగా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి చెప్పుకుంటుంటే ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. త్వరలోనే హుజూరాబాద్ ప్రజలు కోడిగుడ్లు, రాళ్లతో తరిమికొట్టే రోజులు వస్తాయన్నారు. జమ్మికుంట రోడ్‌లో చాకలిఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జమ్మికుంటలో పలు దుర్గామాత మండపాల్లో ప్రత్యేకపూజలు చేశారు. హుజూరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో గుడిపాటి జయపాల్‌రెడ్డి, జమ్మికుంటలో నాయకులు పొనగంటి మల్లయ్య, కసుబోజుల వెంకన్న, తుమ్మేటి ప్రవీణ్‌రెడ్డి, బల్మూరి మాధవరావు, ఎరబెల్లి రాజేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

చక్కెర ఫ్యాక్టరీ పునరుద్ధరణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

● మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


వేంపేటలో మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీ పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మెట్‌పల్లిమండలం వేంపేట గ్రామంలో శుక్రవారం ముత్యంపేట చక్కెరఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం అధ్యయనం చేయడానికి ఉన్నతస్థాయి అధికారుల బృందం రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించగా మంత్రి అడ్లూరి పాల్గొన్నారు. ఈసందర్భంగా రైతుల నుంచి రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమలు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సంజయ్‌కుమార్, వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్‌రావు, కమిటీడైరెక్టర్ నర్సిరెడ్డి తదితరులు చక్కెరఫ్యాక్టరీ పునరుద్ధరణపై అభిప్రాయాలను సేకరించారు. రైతునాయకుడు అల్లూరి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు సబ్సిడీ సీడ్, మద్దతు ధర, హార్వెస్టింగ్ వంటిసౌకర్యాలు కల్పిస్తే చెరుకు అధికశాతం సాగు చేస్తామని అధికారులను కోరారు. ఫ్యాక్టరీ ప్రారంభించడానికి సంపూర్ణ మద్దతు ఇస్తామని నాయకుడు మామిడి నారాయణరెడ్డి అధికారులకు తెలిపారు. రైతు కోఆపరేటివ్ సొసైటీల ఆధ్వర్యంలో చక్కెర కార్మాగారాలను నిర్వహించడానికి మాజీసీఎం కేసీఆర్ రూపకల్పన చేశారని, ప్రస్తుతం ప్రభుత్వంముందుకు వచ్చినందున రాజకీయలకు అతీతంగా ఏకమవ్వాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పిలుపునిచ్చారు. మాజీమంత్రి జీవన్‌రెడ్డి మాట్లాడుతూ ఫ్యాక్టరీ పునరుద్ధరణ చేయడం వలన జగిత్యాల జిల్లాతోపాటు నిర్మల్, నిజామాబాద్ జిల్లాలకు ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు.

● వన్ టైం సెటిల్‌మెంట్ కింద రూ.172 కోట్లు చెల్లింపు..

మంత్రి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీమేరకు సీఎం రేవంత్‌రెడ్డి ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఫ్యాక్టరీపై 51శాతం వాటా కలిగిన డెల్టా పేపర్స్‌లిమెటెడ్‌వారు బ్యాంక్‌లో ఫ్యాక్టరీలపైన రూ.400కోట్ల బకాయిలు ఉన్నాయని ప్రభుత్వానికి తెలపారన్నారు. దీంతోరాష్ట్ర ప్రభుత్వం వన్‌టైం సెటిల్‌మెంట్ కింద రూ.172 చెల్లించి పత్రాలను తీసుకోవడంతో అన్ని హక్కులు పొందిందన్నారు. ప్రస్తుతం కార్మాగారాల్లోగల యంత్రాలు వినియోగం, మరమ్మతులతో నడిపిం చుకునే వీలుందా అని అధ్యయనం చేయడానికి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించామన్నారు. ఫ్యాక్టరీ వినియోగంలోకి రావాలంటే 15వేల ఎకరాలలో చెరుకు సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్, కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్, జువ్వాడి నర్సింగరావు, అల్లూరి మహేందర్ రెడ్డి, కిసాన్‌సెల్ జిల్లాఇన్‌చార్జి వాకిడి సత్యంరెడ్డి పాల్గొన్నారు.

● చక్కెర ఫ్యాక్టరీ సందర్శన


ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తదితరులు

మల్లాపూర్: మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామ శివారు లోని నిజాంచక్కెర ఫ్యాక్టరీని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, కోరుట్లఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మాజీమంత్రి జీవన్‌రెడ్డి, రాష్ట్రప్రభుత్వ పరిశ్రమల, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ స్పెషల్ చీఫ్‌సెక్రెటరీ సంజయ్‌కుమార్, వ్యవ సాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు, కమిటీ డైరెక్టర్ నర్సిరెడ్డిలు శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా ఫ్యాక్టరీ కార్మికులు, రైతులతో మాట్లాడి పునరుద్ధరణ గురించి వివరాలు సేకరించారు.

కూష్మాండ అలంకారంలో అమ్మవారి దర్శనం



వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న ఆలయంలో శ్రీరాజ రాజేశ్వరీదేవి అమ్మవారు శుక్రవారం కూష్మాండ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాజన్న ఆలయంలో చేపడుతున్న శ్రీదేవినవరాత్రోత్సవాల్లో భాగంగా ఐదో రోజున ఆలయ అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. శ్రీరాజరాజేశ్వర స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. కాగా వేములవాడ పట్టణంలోని గాంధీనగర్ అంజనీయూత్ ఆధ్వర్యంలో అమ్మవారు మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు కుంకుమ పూజకు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

రాజన్న ఆలయంలో భక్తులు రద్దీ

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. శుక్రవారం ఉదయం స్వామివారి ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని కోడెమొక్కులు చెల్లించుకున్నారు. కుంకుమ పూజలో పాల్గొన్నారు.

ధర్మపురిలో స్కందమాత రూపంలో..



ధర్మపురి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నృసింహస్వామి అనుబంధ రామలింగేశ్వరస్వామి ఆలయంలో దసరా నవరాత్రోత్సవాలు ఐదవ రోజు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మ వారలు స్కంద మాత రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చింది. రామ లింగేశ్వరస్వామి ఆలయంలో స్థానిక మహిళలు కుంకు మార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు ఆలయాల్లో ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా శక్తి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి వద్ద గడుదాసు మనోజ్- కళ్యాణి దంపతులు సుమారు 3 వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. నవ దుర్గ సేవా సమితి, మహాశక్తి సేవా సమితి ఆధ్వర్యంలో కుంకుమ పూజలు నిర్వహించారు. టీటీడీ కల్యాణ మండపంలో నవదుర్గ సేవా సమితి, చింతామణి చెరువు వద్ద మహా శక్తి సేవా సమితి ఆధ్వర్యంలో అమ్మవారలకు పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జుక్కు రవీందర్ పాల్గొన్నారు.

వైభవంగా స్వామి వారి పెద్దసేవ



పెద్ద సేవలో పాల్గొన్న విప్ ఆది శ్రీనివాస్, ఈవో రమాదేవి

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న ఆలయంలో స్వామివారలు సాయంత్రం నంది, గరత్మంతుడు వాహనాలపై కొలువుదీరగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలో పాల్గొని పెద్ద సేవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వాతవరణం కారణంగా ఊరేగింపును రద్దు చేసి అంతరాలయంలో పెద్ద సేవ నిర్వహించారు. ఈవో రమాదేవి, ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, గోవిందుల అశోక్‌కుమార్ తదితరులున్నారు.

మహాశక్తి ఆలయంలో మాజీ సీఎస్ పూజలు



పూజలో పాల్గొన్న మాజీ సీఎస్ శాంతికుమారి

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ చైతన్యపురి మహాశక్తి దేవాలయంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర మాజీ చీఫ్ సెక్రెటరీ శాంతికుమారి పూజలు నిర్వహించారు. ఆమెకు అర్చకులు ఆశీర్వచనం చేసి ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి, ఆలయ నిర్వాహకుడు బండి సంజయ్‌కుమార్, మాజీ మేయర్ సునీల్‌రావు, ఆర్‌డీవో మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం.. ఆహ్లాదం ఆనందం



నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సెలవులు.. ప్రత్యేక వేడుకల సందర్భంలో... ఇంటిల్లిపాది అలా ఎక్కడికైనా వెళ్ళి గడిపి రావాలనిపిస్తోంది. ఆయా ప్రాంతాల ఘన ఆధ్యాత్మిక, వారసత్వ చరిత్ర, విశేషాదులను తెలుసుకొని ఓ విస్తృత విజ్ఞాన ప్రపంచంలో విహరించాలనిపిస్తోంది. మంత్ర ముగ్ధుల్ని చేసే ఆ ప్రాంతాల సందర్శన జీవితంలో మరపురాని ఓ మధురానుభూతిగా ఉంటుంది. పుణ్య క్షేత్రాల దర్శనతో అలౌకిక ఆధ్యాత్మికతతో పాటు చారిత్రక, విజ్ఞాన కేంద్రాల సందర్శనతో ఆహ్లాదం, ఆనందం మన సొంతమవుతుంది. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని పర్యాటక ప్రాంతాల విశేషాలు తెలుసుకుందాం..

ఉమ్మడి జిల్లాలో పుణ్యక్షేత్రాలు

ఉమ్మడి జిల్లాలో పలు పుణ్య క్షేత్రాలు ఉన్నాయి. వేములవాడ రాజ రాజేశ్వరస్వామి, ధర్మపురి లక్ష్మీ నృసింహస్వామి, కాళేశ్వరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామి, కొండగట్టుఆంజనేయ స్వామి క్షేత్రాలు ప్రాధాన్యమున్న క్షేత్రాలు. సుందిళ్ల రేకుర్తి, బెజ్జంకి, కోట్ల నరసింహులపల్లె, బీర్‌పూర్‌లో నరసింహస్వామి ఆలయాలు ఉన్నాయి. మంథని గోదావరి తీరాన గౌతమేశ్వర స్వామి ఆలయం ఉంది. నీరుకుళ్లలో రంగ నాయకస్వామి, కమాన్‌పూర్‌లో ఆదివరాహస్వామి, కోటి లింగాలలో కోటేశ్వర స్వామి కొలువై ఉన్నారు. కరీంనగర్ పాతబజార్ గౌరీ శంకర ఆలయానికి చారిత్రక ప్రాధాన్యం ఉంది.



నేపథ్యం

ప్రతీ యేడాది సెప్టెంబరు 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం జరుపుకుంటారు. సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, సాంప్రదాయ విలువల అభివృద్ధికి పర్యాటక రంగం తోడ్పడాలని టూరిస్ట్ ట్రాఫిక్ కమిటీ స్థాపించిన సందర్భంగా 1948 నుంచి పర్యాటక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. పర్యాటక రంగంలోని విభిన్న సంస్కృతులను ప్రోత్సహించడం, ఆయా పర్యాటక ప్రాంతాలను ప్రపంచానికి పరిచయం చేయడం, పర్యాటక ప్రాముఖ్యాన్ని పెంచడం ఈ దినోత్సవ లక్ష్యం.

పర్యాటక ప్రాంతాలు

కరీంనగర్‌లో దిగువ మానేరు డ్యాం, ఉజ్వల పార్క్, డీర్ పార్క్‌లు, ఎల గందల కోట, మొలంగూర్ కోట, సైదాపూర్‌లో సర్వాయి పాపన్న గుట్ట (కొమ్ము గుట్ట), గంగాధర మం డలంలోని బొమ్మలమ్మ గుట్ట ఉన్నాయి. పెద్దపల్లి జిల్లాలో ఎన్టీపీసీ, సింగరేణి, రాముని గుండాల, ఆండాల్ ఆలయం ఉన్నాయి.

ధూళికట్టలో బౌద్ధ స్తూపం ఉంది. రాజన్న సిరిసిల్లలో ఎగువ మానేరు, మధ్య మానేరు, మిడ్ మానేరు మధ్యలో దత్తాత్రేయ స్వామి ఆలయం పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. జగిత్యాల జిల్లాలో సైఫన్, గోదావరి తీర ప్రాంతాలు, కోటలు, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న గడులు, చెరువులు పర్యాటకులకు ఆహ్లాదం పంచుతున్నాయి. పలు జలాశయా ల్లో బోటింగ్ సౌకర్యం ఉంది. సెలవుల రోజుల్లో ఈ ప్రాంతాలు పర్యాటకులతో కళకళలాడుతుంటాయి.

చారిత్రక ప్రాధాన్యం ఉన్న ప్రాంతాలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పురాతత్వ వారసత్వ కట్టడాలు 150 వరకు ఉండగా అందులో పురాతత్వ శాఖ గుర్తించిన ప్రదేశాలు, కట్టడాలు 50 నుంచి 60 వరకు ఉన్నా యి. 1850 నుంచి 1950 వరకు వివిధ ప్రదేశాలు, గ్రామాల్లో కట్టిన 350 బురుజులు ఉన్నాయి. మౌర్యులు, శాతవాహనులు, విష్ణుకుండినులు, బాదామీ చాళుక్యులు, పశ్చిమ చాళుక్యులు, కాకతీయులు, వేములవాడ చాళుక్య లు, పొలవాస, విజయనగర రాజులు ఈ జిల్లా ప్రాంతానికి వచ్చినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. అనంతరం బహమనీయులు, మొఘలా యీలు, కుత్‌బుషాహీలు, అసఫ్‌జాహీలు ఈ నేలపై కాలు మోపారు. ఉమ్మడి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు పట్టించుకునే వారు లేక శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

ధూళికట్ట బౌద్ధ స్తూపం, జగిత్యాల, ఎలగందుల, మొలంగూరు కోటలు శిథిలమవుతు న్నాయి. ఎలగందుల కోటలో ఏర్పాటు చేసిన సౌండ్, లైటింగ్ షో మూలనపడింది. కోటి లింగాలలో తొలి శాతవాహన స్థావరం 1975లో బయట పడగా గోదావరి నీటి ముంపుకు గురి కాకుండా రక్షణ గోడ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. చారిత్రాత్మక పొలాస గుళ్లు శిథిలమవుతున్నాయి. నగునూరు, కొత్తపల్లి, బొమ్మలమ్మగుట్ట అభివృద్ధికి నోచుకోవాల్సిన అవసరం ఉంది.

శిథిలావస్థకు కరీంనగర్ మ్యూజియం

కరీంనగర్ మ్యూజియం శిథిలావస్థకు చేరుకుంది. స్మార్ట్ సిటీ పథకం కింద ఉన్నా ఎన్నో ప్రభుత్వ భవనాలు అందులో చేర్చినా పురావస్తు శాఖ భవనాలకు నిధులు కేటాయించలేదు. మ్యూజియంను కూడా అభివృద్ధి చేయాలని చరిత్రకారులు, సందర్శకులు కోరుతున్నారు.

వేములవాడలో నేడు పూల జాతర..

విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్న మూలవాగు

మున్సిపల్ ఆధ్వర్యంలో రూ.30 లక్షలతో ప్రత్యేక ఏర్పాట్లు

హాజరుకానున్న ప్రభుత్వ విప్, కేంద్ర మంత్రి

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వేములవాడలో శనివారం పూల జాతర అంగరంగ వైభవంగా జరగనుంది. రాజన్న ఆలయంలో మహిళలు బతుకమ్మలు ఆడేందుకు ఈవో రమాదేవి ఆధ్వర్యంలో ఏర్పాట్లను చేశారు. రాజన్న ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. మున్సిపల్ కమిషనర్ అన్వేష్ ఆధ్వర్యంలో పట్టణంలోని అన్ని వార్డులతో పాటు మూలవాగు బతుకమ్మ తెప్ప వద్ద బతుకమ్మ వేడుకలకు వైభవంగా ఏర్పాట్లు చేస్తున్నారు. వేములవాడలో సద్దుల బతుకమ్మ వేడుకను ఏడు రోజుల్లోనే నిర్వహించే సాంప్రదాయం కొనసాగుతోంది. సుభాష్‌నగర్, బైపాస్‌రోడ్ల నుంచి మహిళలు బతుకమ్మలతో పెద్ద సంఖ్యలో తరలి వచ్చే అవకాశం ఉండటంతో పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. వేముల వాడ మున్సిపల్ పరిధిలోని రూ.30 లక్షల నిధులతో బతుకమ్మ ఏర్పాట్లను చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తెలిపారు. మూలవాగులో బతుకమ్మ ఆడేందుకు వచ్చే మహిళల కోసం స్టేజీని, డీజే సౌండ్ సిస్టం ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.



విద్యుద్దీపాలతో ఆలయం

ప్రభుత్వ విప్ ఆదికి, కేంద్ర మంత్రికి ఆహ్వానం..

వేములవాడలో శనివారం నిర్వహించనున్న బతుకమ్మ వేడుకలకు స్థానిక శాసన సభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు మున్సిపల్ కమిషనర్ అన్వేష్ ఆహ్వానపత్రికను అందజేశారు. అలాగే కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను కలిసి ఆహ్వానించారు. కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా, ఎస్పీ మహేష్ బి. గితే, ఏఎస్పీ శేషాద్రినిరెడ్డిలను ఆహ్వానించినట్లు తెలిపారు. బహుజన బతుకమ్మ రాష్ట్ర కన్వీనర్ విమలక్క, బీజేపి రాష్ట్ర నాయకుడు ప్రతాప రామకృష్ణ, నాయకులు బతుకమ్మలో పాల్గొననున్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీలో దూసుకెళ్తున్న కరీంనగర్ జట్లు



పోటీల్లో ప్రతిభ చాటుతున్న కరీంనగర్ జిల్లా బాలికల జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్ సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా ముప్కల్ మండల కేంద్రంలో కొనసాగుతున్న 35వ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా బాలబాలికల జట్లు దూసుకెళ్తున్నాయి. బాలుర జట్టు అసిఫాబాద్ జట్టుపై 14 పాయింట్ల(54-40) తేడాతో, నారాయణ జట్టుపై 5 పాయింట్ల(50-45) తేడాతో విజయం సాధించాయి. బాలికల జట్టు మహబూబ్‌నగర్ జట్టుపై 6 పాయింట్లు (32-26), హైదరాబాద్ జట్టుపై 11 పాయింట్ల(20-19) తేడాతో గెలుపొందాయి. ఈ సందర్భంగా జట్లను, కోచ్‌లను రాష్ట్ర కబడ్డీ సంఘం ఉపాధ్యక్షుడు సీహెచ్ సంపత్‌రావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చెన్నాడి అమిత్ కుమార్, మల్లేష్‌గౌడ్ అభినందించారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు



ఎంపికైన లాస్య, నిఖిల్

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈ నెల 29 వరకు నిర్వహించనున్న 17వ మినీ జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. కాటారం ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ విద్యార్థి ఆర్.నిఖిల్, కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పాఠశాల విద్యార్థిని ఎ.లాస్య జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటున్నారని ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేని లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్, జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వేణు గోపాల్, జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కాసర్ల ఆనంద్‌కుమార్, రమణారావు, సంయుక్త కార్యదర్శి నమిలకొండ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేష్, జిల్లా పెటా అధ్యక్ష, కార్యదర్శులు బాబు శ్రీనివాస్, ఆడెపు శ్రీనివాస్, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

ఎస్సారెస్పీ నుంచి 1,10,925 క్యూసెక్కులు దిగువకు

జగిత్యాల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ 39 గేట్లు పైకి ఎత్తి 1,10,925 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5టీఎంసీలకు గాను ప్రస్తుతం 60.118 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరద కాలువకు 2,000 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 5,500, సరస్వతీ కాలువకు 400 క్యూసెక్కులు విడుదల అవుతున్నాయి.

ఎల్ఎండీలోకి తగ్గిన ఇన్‌ఫ్లో

8 నుంచి 4 స్పిల్‌వే గేట్లకు కుదింపు

తిమ్మాపూర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దిగువ మానేరు జలాశ యంలోకి ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో శుక్రవారం తగ్గుముఖం పట్టింది. దీంతో అధికారులు శుక్రవారం ఉదయం 9గంటలకు అప్పటి వరకు తెరచి ఉన్న 8స్పిల్‌వే గేట్లలో నాలుగు మూసి కేవలం నాలుగు గేట్ల నుంచి మాత్రమే 8వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎల్ ఎండీ పూర్తి స్థాయి నీటిమట్టం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.558టీఎంసీల నీరు ఉంది. మోయతుమ్మెద వాగునుంచి 10,336 క్యూ సెక్కులు, మిడ్ మానేరు నుంచి 1250 క్యూసెక్కులు, ఎగువ కాకతీయ కాలువ నుంచి 640 క్యూసెక్కులు మొత్తం 12,226 క్యూసెక్కుల నీరు ఎగువ నుంచి ఎల్ ఎండీలోకి వస్తోంది. ఎల్ఎండీ నుంచి 4స్పిల్‌వే గేట్ల నుంచి 8వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ నుంచి వేయ్యి క్యూసెక్కులు, మిషన్ భగీరథ, ఆవిరి రూపంలో 309 క్యూసెక్కులు మొత్తం 9,309 క్యూసెక్కులు అవుట్ ఫ్లో వెలుతోంది.

జీపీల్లో నిల్ బ్యాలెన్స్

- బతుకమ్మ, దసరా, దీపావళి గడిచేదెలా...
- సమీపిస్తున్న పండుగలు ...
- ఏర్పాట్లకు ఇబ్బంది పడుతున్న పంచాయతీ కార్యదర్శులు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో నిధుల కొరత పంచాయతీ సెక్రెటరీలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. రెండేళ్లుగా గ్రామ పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో బాధ్యతలన్నీ కార్యదర్శులపైనే పడుతున్నాయి.అప్పోసప్పో చేస్తూ పంచాయతీలను నెట్టుకువస్తున్న కార్యదర్శులకు బతుకమ్మ, దసరా, దీపావళి పండుగలు తలనొప్పిగా మారాయి. పండుగ ఏర్పాట్లు ఎలా చేయాలో, పండుగలు ఎలా ముగుస్తాయో తెలియక తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

నిలిచిన నిధుల విడుదల

గ్రామపంచాయతీలకు ప్రధాన ఆర్థిక వనరులైన స్టేట్ ఫైనాన్స్ సెంట్రల్ ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులు పాలకవర్గాలు లేకపోవడంతో రెండేళ్లుగా నిలిచి పోయాయి. ఇక ఆస్తిపన్నులు, ఇతరత్రా పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని జనరల్ ఫండ్ ఖాతాల్లోకి మళ్లించేందుకు చలాన్ల రూపంలో ట్రెజరీలో జమ చేస్తున్నప్పటికి రెండేళ్ల నుంచి వాటిపై ప్రభుత్వం అప్రకటిత ఫ్రీజింగ్ అమలు చేస్తోంది. దీంతో పంచాయతీ జనరల్ ఫండ్ ఖాతాల్లో డబ్బులున్నప్పటికీ వాటిని గ్రామ అవసరాలకు సెక్రెటరీలు వినియోగించ లేని పరిస్థితి నెలకొన్నది. ఈజీఎస్ ద్వారా వచ్చే నిధులను రోడ్లు, డ్రైనేజీలకు మాత్రమే వెచ్చించాల్సి ఉండడంతో నిర్వహణ ఖర్చుల కోసం ఇబ్బంది పడుతున్నారు. టీఎస్ బీపాస్ ద్వారా ఇళ్ల అనుమతులకు సం బంధించిన ఆదాయాన్ని సిబ్బంది వేతనాలకు మాత్రమే విని యోగించాల్సి ఉంటుంది. గతంలో పంచాయతీలకు వచ్చే సీనరేజి ఆదాయం 10 ఏళ్ల నుంచి ప్రభుత్వ ఖాతాలోనే జమవుతోందే తప్ప సంబంధిత గ్రామ పంచాయతీల ద్వారా గ్రామాల అభివృద్ధికి వెచ్చించడం లేదు.



మౌలిక సదుపాయాలకూ కష్టమే..

పంచాయతీ ఎన్నికలు నిర్వహించక పోవడంతో పాలకవర్గాలు లేక కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు కూడా నిలిచి పోయాయి. ఈనేపథ్యంలో గ్రామాల్లో అభివృద్ధి మాట ఎలా ఉన్నా కనీస మౌలిక సదుపాయాల కల్పన కూడా కష్టంగా మారింది. కొన్ని గ్రామాల్లో పంచాయతీ సెక్రెటరీలు లక్షల్లో అప్పులు చేసి వారి జీతాల నుంచి వాటిని చెల్లిస్తున్నామని ఆవేదన చెందుతున్నారు. చాలా గ్రామాల్లో మంచినీటి పైపులైన్లు తరచూ పగిలి పోతుండగా వాటిని మరమ్మతులు చేయించడం, పారిశుధ్యం, హరితహారం, మంచినీటి సరఫరాకు సంబంధించిన ట్రాక్టర్ల నిర్వహణకు, వీధిలైట్లు వెలుగక పోవడంతో వాటి మరమ్మతులకు తామే డబ్బులు వెచ్చించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. ఇప్పటికే దాదాపు మెజార్టీ గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు లక్షల్లోనే అప్పులు చేసి సౌకర్యాలను కల్పిస్తూ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి ఇబ్బందులు పడకుండా వారి కుటుంబాలను పట్టించుకోవడం లేదని సమాచారం.

పండగలకు ఏర్పాట్లు ఎలా..

బతుకమ్మ, దసరా, దీపావళి పండుగలు సమీపిస్తుండడంతో వాటికి కనీస ఏర్పాట్లు ఎలా చేయాలో తెలియడం లేదని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం పండుగల నిర్వహణకు ఎలాంటి నిధులను విడుదల చేయక పోవడంతో గ్రామపంచాయతీ పరిధిలోని పలు చోట్ల బతుకమ్మలను ఆడుకునే మైదానాలను చదను చేయించాల్సి ఉంటుంది. లైట్లు, సౌండ్స్ పారిశుధ్య నిర్వహణ, బతుకమ్మల నిమజ్జనం పాయింట్ల వద్ద ఏర్పాట్లకు కనీసం 50 నుంచి లక్ష రూపాయలైనా అవుతుంది. దీనికితోడు దసరా, దీపావళి పండుగకు కూడా ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. ఈ పండుగలకు లక్షల్లో ఖర్చు చేసేందుకు నిధులు లేవని ఆవేదన చెందుతున్నారు. పండుగల నిర్వహణ కోసమైనా ప్రభుత్వం కొంతైనా నిధులు విడుదల చేస్తే బాగుండేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లకు ఓటరు జాబితాలు, ఇతరత్రా అవసరమ య్యే జిరాక్సులు, కాగితాల ఖర్చులకు కూడా పంచాయతీల్లో డబ్బులు లేవు. వాటి కోసం నిత్యం తమ జీతాల్లోని డబ్బులను వెచ్చిస్తున్నామని పంచాయతీ సెక్రెటరీ ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం గ్రామపంచాయతీలకు నిధులు విడుదల చేయాల్సిన అవసరం ఉంది.

ఖనిలో భారీ వర్షం...

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పట్టణంలో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం రాత్రి పిడుగులు, ఉరుములతో వర్షం కురిసింది. వర్షంతో ఫైవింక్లయిన్, 2 ఇంక్లైన్ మోరీల వద్ద రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గురువారం గోదావరిఖనిలో 3 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. శుక్రవారం రాత్రి కురిసిన వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి.

వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

పెద్దపల్లి, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజుల పాటు భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నందున విద్యుత్ వినియోగదారులు, రైతులు జాగ్రత్త వహించాలని పెద్దపల్లి సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. లోడ్ మానిటరింగ్ చేస్తున్నామని తెలిపారు. మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్ వాహనాలను ఏర్పాటు చేసుకున్నామని, విద్యుత్ అంతరాయం ఏర్పడిన వెంటనే పునరుద్ధరణకు టీంలు సిద్ధంగా ఉన్నాయన్నారు. తడిగా ఉన్న స్తంభాలను ముట్టుకోవద్దని, ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గరకు వెళ్లకూడదని అన్నారు. రైతులు, వినియోగదారులు సొంతంగా విద్యుత్ పనులు చేయవద్దన్నారు. తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను తాకరాదన్నారు. విద్యుత్ సమస్యలు ఎదురైతే వెంటనే 1912 టోల్‌ఫ్రీ నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

పెద్దాపూర్‌లో కోతుల బెడద


పెద్దాపూర్‌లో ఇళ్లపై ఉన్న కోతులు

జూలపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కోతుల బెడదతో పెద్దాపూర్ గ్రామస్థులు బెంబేలెత్తుతున్నారు. కొద్దిరోజులుగా వందలాది కోతులు ప్రజలపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. దీంతో ప్రజలు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. ఇళ్లపై చేరుతున్న పెంకులను తొలగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వందలాది కోతులు గుంపులుగా తిరుగుతున్నాయని, అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి రక్షించాలని కోరుతున్నారు.

బావులు, ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలి

ఓదెల,సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వైరల్ జ్వరాలు వస్తున్నందున ముందు జాగ్రత్తగా ఇళ్లలోని బావులతోపాటు తాగు నీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించాలని శుక్రవారం ఉప్పరపల్లి కార్యదర్శికి యువకులు వినతిపత్రాన్ని అందజేశారు. బతుకమ్మ, దసరా, దీపావళి వేడుకలు ఉన్నందున విద్యుత్ దీపాలను అమర్చాలని కోరారు. మురికి కాలు వెంట ఉన్న పూడికను తీయించాలని, గడ్డి లేకుండా శుభ్రం చేయాలని కోరారు. యువకులు పల్లె రాకేష్, మధుకర్, ప్రకాష్, శ్యామ్, రోహిత్ పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

కమాన్‌పూర్, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): రొంపికుంట గ్రామానికి చెందిన గుమ్మడి సాయిచరణ్ ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రిలో చేరారు. ఆయనకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అండగా నిలిచారు. బాధితుడి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2.50 లక్షల ఎల్‌వోసీని మంజూరు చేయించి, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం అందజేశారు.

బీజేపీ మండల కార్యవర్గం

ధర్మారం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల కార్యవర్గాన్ని ఆ పార్టీ అధ్యక్షుడు తీగుల్ల సతీష్ రెడ్డి శుక్రవారం ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా కర్రె లక్ష్మణ్, దేవి కొమురేష్, సామంతుల కిరణ్, బైరి శేఖర్, ప్రధాన కార్యదర్శులుగా కుందెల్ల కిరణ్, దేవి రాజలింగు, సాయిని నియమించారు. కార్యదర్శులుగా జనగామ సంజీవ్, చీకట్ల శేఖర్, పల్లె లక్ష్మణ్, సాగంటి నర్సయ్య, కోశాధికారిగా కేషనేని నాగరాజు, కార్యదర్శులుగా నాడెం మల్లేశం, గడ్డం రాజేశ్వరరెడ్డి, మల్యాల వెంకటేష్, కుంట రాజిరెడ్డి, శాఖపురం వెంకటేష్, వన్నెల బాల్‌రెడ్డిని నియమించారు. యువమోర్చా అధ్యక్షుడిగా మామిడి చందు, దళిత మోర్చా అధ్యక్షుడిగా రమేష్, ఎస్సీ, ఎస్టీ అధ్యక్షుడిగా రవి, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా రాజేశ్వరి, కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా దీటి మల్లయ్య నియామకమయ్యారు.

బాధిత కుటుంబాలకు మంత్రి పరామర్శ

మంథనిరూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పలు బాధిత కుటుంబాలను రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గురువారం రాత్రి పరామర్శించారు. మల్లారం మాజీ సర్పంచ్ మానెం సత్యనారాయణ తల్లి లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఎస్సీ కాలనీలో కాసిపేట వెంకటేష్ తల్లి అనారోగ్యంతో మృతి చెందారు. శ్రీపాదకాలనీలో శీలం దేవేందర్ కుమారుడు రాజ్‌కుమార్ ఇటీవల మృతి చెందగా పరామర్శించారు.

బాధిత కుటుంబాలకు ఎంపీ అండ

పాలకుర్తి,సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లె గ్రామంలో ఇటీవల పర్ష బుగ్గమ్మ, రేగుల కవిత మృతి చెందారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గొట్టపర్తి నరేష్ ఎంపీ గడ్డం వంశీకృష్ణకు తెలపడంతో బాధిత కుటుంబాలకు 50 కిలోల చొప్పున బియ్యం అందజేశారు. రమేష్, పుట్ట రమేష్, ధర్మేందర్, సంతు పాల్గొన్నారు.

డీఎస్పీగా ఎంపికైన లతీఫా ఆశ



కోల్‌సిటీ, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): మార్కండేయకాలనీకి చెందిన డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ దాదాసలాం, దివంగత దస్తగిరమ్మ కుమార్తె లతీఫా ఆశ డీఎస్పీగా ఎంపికైంది. రాష్ట్రస్థాయిలో 46వ ర్యాంకు సాధించింది. స్థానిక సెక్రడ్ హార్ట్ పాఠశాలలో 10వ తరగతి, ఇంటర్ హైదరాబాద్, బీటెక్ గుంటూరులో చదివారు. డీఎస్పీగా ఎంపికైన లతీఫా ఆశను పలువురు అభినందించారు.

చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష, కమిషనరేట్‌లో సీపీ అంబర్ కిశోర్ ఝా

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి): వీర వనిత చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి మహిళ శక్తికి స్ఫూర్తిదాయకమని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఐలమ్మ జయంతి వేడుకల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐలమ్మ సంఘ సేవకురాలుగా, సాయుధ రైతాంగ పోరాటంలో ప్రదర్శించిన పోరాట పటిమతో వీరవనితగా చరిత్రలో నిలిచిపోయారని తెలిపారు. సమాజహితం కోసం పోరాటం చేసిన మహనీయుల స్ఫూర్తి, వారి జయంతి, వర్ధంతిని అధికారికంగా ప్రభుత్వం నిర్వహిస్తుందని తెలిపారు. జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి రంగారెడ్డి, రజక సంఘ నాయకులు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

తిలక్‌నగర్‌లోని ఐలమ్మ విగ్రహానికి రజక సంఘం నాయకులు నివాళులర్పించారు. పూలమాలలు, కేక్ కట్ చేసి ఉత్సాహంగా జరుపుకున్నారు. నాయకులు మాట్లాడుతూ భూమి, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాటం చేసిందన్నారు. కుల పెద్ద బొడ్డుపల్లి రామ్మూర్తి, గౌరవ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్, నవీన్, కుమారస్వామి, అశోక్, కృష్ణ, సంపత్, దొడ్డిపల్లి కొమరయ్య, మల్లికార్జున్, కనకయ్య, మాజీ కౌన్సిలర్లు భూతగడ్డ సంపత్, తాడూరి శ్రీమాన్, బిమోజు సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

కోల్‌సిటీ: తెలంగాణ వీరవనిత, మహిళా చైతన్యానికి, ఆత్మగౌరవానికి ప్రతీక చాకలి ఐలమ్మ అని సీపీ అంబర్ కిశోర్ ఝా అన్నారు. కమిషన రేట్‌లో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు ఐలమ్మ పెత్తందారుల దురాగతాలను ఎండగడతూ, నిజాం నిరంకుశ రజాకార్లకు, దేశ్‌ముఖ్‌లకు వ్యతిరేకంగా ఐలమ్మ పోరాడారన్నారు. ఆమె చేసిన పోరాటమే తెలంగాణ సాయుధ పోరాటానికి స్ఫూర్తి అన్నారు. అడిషనల్ డీసీపీ(అడ్మిన్) శ్రీనివాస్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఏఓ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు భీమేష్, దామోదర్, వామనమూర్తి, పాల్గొన్నారు.

ధర్మారం: దొంగతుర్తిలో ఆజాది ఫెడరేషన్, రజక సంఘ నాయకులు చాకలి ఐలమ్మ జయంతి నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీసీ ఆజాది ఫెడరేషన్ నియోజకవర్గ అధ్యక్షుడు ముదాం శ్రావణ్ కుమార్, తమ్మడవేణి శ్రీనివాస్, రజక సంఘం అధ్యక్షుడు అలువాల రాజు, మందపల్లి సతీష్, గొట్టె లింగయ్య, బాణేష్, శాతరాజు తిరుపతి, అలువాల హనుమన్లు, ప్రశాంత్, లక్ష్మణ్, పాల్గొన్నారు.

కమాన్‌పూర్: మండలంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను నిర్వహించారు. బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు బొమ్మగాని అనిల్‌గౌడ్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మిమల్లు, జూలపల్లి మాజీ ఉప సర్పంచ్ సాయికుమార్, బీఆర్ఎస్ నాయకులు భూమయ్య, జూలపల్లి గ్రామయూత్ అధ్యక్షుడు దేవేందర్, జంగపల్లి వెంకటేశం, ఎల్లయ్య, కనకయ్య, చిన్న రవి, అజయ్, సారయ్య, కొమురయ్య, పాల్గొన్నారు.

మంథని: చాకలి ఐలమ్మ జయంతిని నివాళులర్పించారు. ఐలమ్మ విగ్రహానికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్, నేతలు తగరం శంకర్‌లాల్, మాచీ రాజుగౌడ్ పూలమాలలు వేశారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఐలి ప్రసాద్, నాయకులు నివాళులర్పించారు. కనవేన శ్రీనివాస్, కాయితి సమ్మయ్య, గొబ్బూరి వంశీ, ఆరెపల్లి కుమార్, పుప్పాల తిరుపతి, ఆకుల రాజబాబు, మంథని లక్ష్మణ్, ఏఎంసీ చైర్మన్ కుడుదుల వెంకన్న, పాల్గొన్నారు.

జ్యోతినగర్: పట్టణ రజక సేవా సంఘం అధ్యక్షుడు పూసాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మేడిపల్లి సెంటరులో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈదునూరి మల్లేష్, భరత్‌గౌడ్, పైతరి రాజుమొండయ్య, గంగాధర్, రాజేశం, శ్రీనివాస్, కరుణాకర్, ఐలయ్య, సత్తయ్య, రాజయ్య, పాల్గొన్నారు.

ఎలిగేడు: ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. రజక సంఘం నాయకులు ముంజంపల్లి రాకేష్, ముంజంపల్లి కొమురయ్య, అనిల్, ఓదెలు, రమేష్, వంశీ, మహేందర్, మహేష్, రాజు, పలు కుల సంఘాల నాయకులు అడ్డగుంట శ్రీనివాస్ గౌడ్, బాసంపల్లి వినోద్, శంకర్, గుజ్జుల నంబయ్య తదితరులు ఉన్నారు.

సుల్తానాబాద్ : ఐలమ్మ జయంతిని రజక సంఘం పట్టణ అధ్యక్షుడు నిట్టూరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మిరాజమౌళి, మాజీ వైస్ చైర్మన్ బిరుదు సమతా కృష్ణ, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు పారుపెల్లి గుణపతి, మనోజ్‌గౌడ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్ యాదవ్, మాజీ సర్పంచ్ అజయ్ పాల్గొన్నారు. రాజేశం, నిట్టూరు అంజయ్య, మైసయ్య, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం టెండర్లకు నోటిఫికేషన్ జారీ

(5వ పేజీ తరువాయి)

గెజిట్ నంబర్ 35 షాపు, గోదావరిఖనిలోని గెజిట్ నంబర్ 43, గెజిట్ నంబర్ 45 షాపు, గెజిట్ నంబర్ 47 షాపు, పాలకుర్తి మండలం కన్నాల, జీడీనగర్‌లోని గెజిట్ నంబర్ 57 షాపు, మంథని మున్సిపాలిటీ పరిధి లోని గెజిట్ నంబర్ 65 షాపు, రామగిరి మండలం రత్నాపూర్, కల్వచర్లలో గల గెజిట్ నంబర్ 72 షాపు, ముత్తారంలో గెజిట్ నంబర్ 74 షాపులు ఉన్నాయి.

● ఎస్సీలకు కేటాయించిన 8 షాపుల్లో పెద్దపల్లి పట్టణంలోని గెజిట్ నంబర్ 8 షాపు, ధర్మారంలోని గెజిట్ నంబర్ 15, ఎలిగేడు మండలం శివపెల్లి గెజిట్ 16, గోదావరిఖనిలోని గెజిట్ నంబర్ 38, గెజిట్ నంబర్ 39, గెజిట్ నంబర్ 42 షాపు, మంథని మున్సిపాలిటీ పరిధిలోని గెజిట్ నంబర్ 62, గెజిట్ నంబర్ 66 షాపులు ఉన్నాయి.

దరఖాస్తులను పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో గల ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఆవరణలో స్వీకరిస్తున్నారు. మొదటి రోజు సుల్తానాబాద్‌లో ఒకటి, మంథనిలో ఒకటి, రామగుండంలోని షాపులకు ఒక దరఖాస్తు వచ్చిందని ఎక్సైజ్ సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

పత్తి రైతులకు కనీస మద్దతు ధర అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): పత్తి పంటకు కనీస మద్దతు ధర దక్కేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఈ సీజన్‌లో 48,215 ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేశారని తద్వారా 5,78,580 క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందన్నారు. అక్టోబర్ 15 నుంచి మార్కెట్లకు పత్తి పంట వస్తుందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం 8 శాతం తేమకు మించకుంటే కనీస మద్దతు ధర క్వింటాలుకు 8,110 రూపాయలు చెల్లించాలని అన్నారు. జిల్లాలో 5 చోట్ల సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేశామని, మార్కెట్లలో మద్దతు ధర దక్కకుంటే రైతులను సీసీఐ కేంద్రాలకు పంపించాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు పత్తి పంట తీసుకొని వచ్చే రైతులు నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు. బ్యాంకు ఖాతాతో ఆధార్ కార్డుతో లింకు చేయాలని కపాస్ కిసాన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. పత్తి అమ్మకానికి తీసుక వచ్చే ముందు యాప్‌లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలన్నారు. రైతులు మద్దతు ధర కంటే తక్కువకు పత్తి పంట అమ్మవద్దని, మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని, ప్రైవేట్ వ్యాపా రుల వద్ద మద్దతు ధర లభించని పక్షంలో నేరుగా జిన్నింగ్ మిల్లులకు వచ్చి పత్తి పంట అమ్ముకోవాలని కలెక్టర్ సూచించారు. డీఎంఓ ప్రవీణ్ రెడ్డి, డీఏఓ శ్రీనివాస్, ఆర్‌టీఓ రంగా రావు, జిల్లా తూనికల కొలతల అధికారి, మార్కెట్ కార్యదర్శులు, సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి


ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెలించాలని గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిపెల్లి రవీందర్, ఎండి ఖాజ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. దసరా పండుగకు కార్మికులు పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడిందని, 3 నెలల బకాయిలు తక్షణమే చెల్లించాలని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు పంచాయతీ సిబ్బంది వేతనాలను గ్రీన్‌ఛానల్ ద్వారా కార్మికుల బ్యాంక్ అకౌంట్లలో జమ చేయాలన్నారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు లచ్చయ్య, పైడిపల్లి నాగయ్య, సహాయ కార్యదర్శిలు నాగేశ్వర్, కమిటీ సభ్యులు దేవేందర్, భీమయ్య,ప్రేమ్ కుమార్ భాస్కర్, శంకర్, అప్సర్, మల్లేష్, అశోక్ పాల్గొన్నారు.

బీఎంఎస్‌ది అనైతిక గెలుపు


విలేకరులతో మాట్లాడుతున్న బాబర్

జ్యోతినగర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ గుర్తింపు ఎన్నికల్లో బీఎంఎస్ అనైతిక చర్యలకు పాల్పడి గెలిచిందని ఐఎన్‌టియుసి జాతీయ కార్యదర్శి, ఎన్‌బీసీ సభ్యుడు బాబర్ సలీంపాషా ఆరోపించారు. శుక్రవారం ఐఎన్‌టియుసి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఎంఎస్ విచ్చలవిడిగా డబ్బులు పంచిందన్నారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధి ఎన్టీపీసీ కాంట్రాక్టర్ల ద్వారా 3 లక్షల రూపాయలు బీఎంఎస్‌కు పంపిణీ చేశారని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు కుమ్మక్కై ఐఎన్‌టియుసి ఓడించేందుకు పని చేశారన్నారు. నాలుగు దశాబ్దాలుగా ఎన్టీపీసీ కార్మికుల ప్రయోజనాల పరిరక్షణకు కృషి చేస్తున్న ఐఎన్‌టియుసిని ఓడించే సత్తాలేని బీఎంఎస్ తప్పుడు విధానాలకు పాల్పడిందన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న మాజీ బీఎంఎస్ నాయకుడు ఆ యూనియన్ గెలుపునకు పని చేశాడని, కార్మికులను మభ్యపెట్టి బీఎంఎస్‌కు మద్దతునివ్వాలని ఒత్తిడి చేశాడని ఆరోపించారు. 60 శాతం ఓట్లు రాకపోతే మొదటి రెండు స్థానాల్లో నిలిచిన యూనియన్లకు రెండు ఎన్‌బీసీ సభ్యులను కేటాయిస్తారన్నారు. ఐఎన్‌టియుసికి ఒక ఎన్‌బీసీ స్థానంతోపాటు అన్ని కమిటీలలో సభ్యత్వం ఉంటుందని స్పష్టం చేశారు. కేవలం 8 ఓట్లు బీఎంఎస్‌కు ఎక్కువ వచ్చాయని, ఆ యూనియన్ నాయకులు ఘన విజయం సాధించామని గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కార్మికుల హక్కుల కోసం పోరాడామని తెలిపారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణయ్య, రాజేశ్వర్ తదితరులున్నారు.

వినూత్న వ్యాపారాలతో సంఘాన్ని అభివృద్ధి చేశాం


మాట్లాడుతున్న చైర్మన్ కొత్త శ్రీనివాస్

మంథని, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వినూత్న వ్యాపారాలతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నామని మంథని సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ వెల్లడించారు. పీఏసీఎస్ కార్యాలయంలో శుక్రవారం సంఘం 87వ సర్వసభ్య సమావేశం జరిగింది. చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు అన్ని విధాలుగా సేవలందిస్తున్నామని, మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో రైస్‌మిల్లు, సోలార్ ప్లాంట్ లాంటి వ్యాపారాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. రైతులకు సకాలంలో స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు, సబ్సిడీ ఎరువులు, విత్తనాలు అందిస్తున్నామన్నారు. బీ గ్రేడ్‌లో కొనసాగిన సంఘాన్ని ఈ ఆర్థిక సంవత్సరంలో ఏ గ్రేడ్‌లో తీసుకువచ్చేలా కృషి చేశామన్నారు.

సంఘం చరిత్రలో తొలిసారి సభ్యులకు డివిడెండ్ ప్రకటించడం గర్వంగా ఉందన్నారు. ఎన్నికైన ఏఎంసీ చైర్మన్ కుడుదుల వెంకన్నను సన్మానించారు. సంఘం ఆర్థిక నివేదికను సీఈవో మామిడాల అశోక్ నివేదించారు. ఉపాధ్యక్షుడు బెల్లంకొండ ప్రకాష్‌రెడ్డి, డైరెక్టర్లు మాచీడి రాజుగౌడ్, రావికంటి సతీష్‌కుమార్, ఆకుల రాజబాబు, దేవళ్ళ విజయ్‌కుమార్, పెద్దిరాజు ప్రభాకర్, కిషన్‌రెడ్డి, కొత్త శ్రీనివాస్, సిరిమూర్తి ఓదెలు, మాధవి-పర్వతాలు యాదవ్, దాసరి లక్ష్మి-మొండయ్యలు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘ భవనానికి, హాస్టల్‌కు స్థలం కేటాయించాలి


మంత్రి శ్రీధర్‌బాబుకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

పెద్దపల్లి టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో మున్నూరు కాపు సంఘం, హస్టల్ భవనానికి కావాల్సిన స్థలాన్ని కేటాయించాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తమ్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎలువాక రాజయ్య మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కోరారు. శుక్రవారం సంఘ నాయకులు హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు. మంథని మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కాపు సామాజిక వర్గానికి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘ భవనానికి, హాస్టల్‌కు స్థలం కేటాయించే విషయమై మంత్రి కలెక్టర్‌కు ఫోన్ చేసి ప్రతిపాదనలు సిద్ధం చేసి సీసీఎల్‌ఏకు పంపించాలని ఆదేశించారని, భవనాల నిర్మాణాలకు నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారని ఎల్ రాజయ్య పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్‌బాబుకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

జూనియర్ కళాశాలల్లో పేరెంట్స్ కమిటీ సమావేశం

కోల్‌సిటీటౌన్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో శుక్రవారం తల్లిదండ్రుల, అధ్యాపకుల సమావేశాలు నిర్వహించారు. శారదానగర్‌లో జరిగిన సమావేశానికి ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి కళాశాల ప్రిన్సిపాల్ డి కల్పన, ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిశీలకులు రమణ రావు హాజరయ్యారు. అధ్యాపకులతో పాటు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ రాజేందర్, అధ్యాపకులు పాల్గొన్నారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో పేరంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ బాలరాజు మాట్లాడుతూ విద్యార్థులు సమయపాలన పాటిస్తూ ముఖ హాజరు కావాలన్నారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేరెంట్స్ అధ్యాపకుల సమావేశాన్ని నిర్వహించారు పిల్లల చదువు, హాజరు, ప్రవర్తన అంశాలపై విద్యార్థుల తల్లితండ్రులతో చర్చించారు. తల్లితండ్రుల నుంచి పలు సూచనలు, సలహాలు స్వీకరించారు. విద్యార్థి భవిష్యత్‌కు సమావేశాలు దోహదపడుతాయని ఇంచార్జి ప్రిన్సిపాల్ శ్రీధర్, అధ్యాపకులు పాల్గొన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాలు.. కుంకుమ పూజలు...

కాల్వశ్రీరాంపూర్/మార్కండేయకాలనీ/సుల్తానాబాద్/ కమాన్‌పూర్/ ధర్మారం/ పెద్దపల్లిరూరల్/ మంథని/ పాలకుర్తి సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి):కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో శుక్రవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. డాక్టర్ చందన, పీహెచ్ఎన్ భాగ్యలక్ష్మి, హెల్త్‌సూపర్‌వైజర్లు నీరజ, సరోజన పాల్గొన్నారు. శరన్నవరాత్రుల్లో అమ్మవారు లక్ష్మీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. పవర్‌హౌస్‌కాలనీలోని దుర్గాదేవి ఆలయం, జవ హర్‌న గర్‌లోని జయదుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. అధ్యాపకులు మాట్లాడుతూ తెలంగాణలో బతుకమ్మకు ఉన్న విశిష్టత గురించి వివరించారు. బాపూజీనగర్‌లో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం వద్ద పలువురు మహిళలు కుంకుమ పూజలు చేశారు. మండల పరిషత్ కార్యాలయ బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. నర్సింగాపూర్‌లో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు రాయల్‌రెడ్డి యూత్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు కుంకుమ పూజ నిర్వహించారు. పెద్దపల్లి మండలంలో మహలక్ష్మీ అవతారంలో దుర్గమాత దర్శనమిచ్చారు. కనగర్తిలో ప్రత్యేక ఆకర్షణగా యువకులు అలంకరించారు. మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. దుర్గా దేవీ మండపాల వద్ద భక్తులు ఓడి బియ్యం సమర్పించారు. వాసవీ మాత ఆలయంలో భక్తులు సామూహికంగా మణిదీపవర్ణన కార్యక్రమాన్ని నిర్వహించారు.



కోల్ ఇండియా స్థాయిలో సింగరేణికి గుర్తింపు తేవాలి



పోటీల ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న జీఎం

రామగిరి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కోల్ ఇండియా స్థాయిలో సింగరేణి సంస్థకు గుర్తింపు తేవాలని ఆర్జీ-3, ఏపిఏ జీఎంలు సుధాకర్‌రావు, నాగేశ్వర్‌రావులు పిలుపునిచ్చారు. సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీ రాణిరుద్రమాదేవి క్రీడాప్రాంగణంలో వర్క్‌పీపుల్స్ అండ్ స్పోర్ట్స్ అండ్‌గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన కంపెనీ స్థాయి షెటిల్, టీటీ పోటీల ముగింపు కార్యక్రమానికి శుక్రవారం జీఎంలు హాజరయ్యారు. పదవీ విరమణ పొందుతున్న సీనియర్ క్రీడాకారులను సత్కరించారు. పోటీల్లో బెల్లంపల్లి-మందమర్రి శ్రీరాంపూర్, రామగుండం 1,2,3 భూపాల్‌పల్లి మణుగూరు-ఇల్లందు, కార్పొరేట్-కొత్తగూడెం, రీజియన్ల నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వైవిరావు, కోటరవీందర్‌రెడ్డి, సుదర్శనం, సాయిస్వరూప్, సూపర్‌వైజర్స్ నరేందర్‌రెడ్డి, అంజయ్య, క్రీడకారులు పాల్గొన్నారు.

కార్మిక సంఘాల ఐక్యతతో మెరుగైన పీఎల్ఆర్ బోనస్

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కార్మిక సంఘాల ఐక్యతతో మెరుగైన పీఎల్ఆర్ బోనస్ సాధించినట్లు సీఐటీయూ ఆర్జీ-2 సెక్రెటరీ కుంట ప్రవీణ్‌కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 కోల్ ఇండియాకు వచ్చిన లాభాల బోనస్‌పై ఈనెల 25న జరిగిన స్టాండర్డైజేషన్ కమిటీ సమావేశంలో రూ.1,03,000 చొప్పున చెల్లించేలా నిర్ణయం జరిగినట్లు ప్రవీణ్ తెలిపారు.

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన సదస్సు

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాల నివారణపై డీజీఎంఎస్ అధికారులు శుక్రవారం సింటార్స్ శిక్షణా కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారం రోజుల పాటు రీజియన్ పరిధిలోని గనులు, ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులలో విద్యుత్ సరఫరా, ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో గుర్తించిన లోపాలు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య, డీఎంఎస్ (ఎలక్ట్రికల్) రాజ్‌కుమార్, డీడీఎంఎస్‌లు కోమల్ చౌదరి, రాజీవ్ ఓంప్రకాష్ శర్మ, ఎస్టోటూ జీఎం రాముడు, సేఫ్టీ ఆఫీసర్ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ తరగతులు ప్రారంభం

గోదావరిఖని, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-1 ఆధ్వర్యంలో తిలక్‌నగర్ సెంటర్ డౌన్‌లో ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా ఎంఎస్ఎంఈ సౌజన్యంలో ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, కంప్యూటర్ గ్రాఫిక్స్ డిజైనింగ్‌లలో శిక్షణ తరగతులు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఆర్జీ-1 ఏరియా జీఎం లలిత్ కుమార్ ప్రారంభించారు. జీఎం మాట్లాడుతూ సీఎండీ బలరాం ఆదేశాలతో నిరుద్యోగ యువతీ, యువతులకు వృత్తి శిక్షణ తరగతులను అందిస్తున్నామన్నారు. డీజీ ఎం(జీవీటీసీ) డిసెల్ కుమార్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఎంఎస్ఎంఈ దశరథం, ఎన్‌జిఓ ఖాన్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ వేణు, సీనియర్ పీఓలు పాల్గొన్నారు.

దుర్గామాతకు పూజలు

గోదావరిఖని, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దుర్గాదేవి దీవెనలు సింగరేణి సంస్థపై, కార్మిక కుటుంబాలపై ఉండాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య ఆకాంక్షించారు. దేవిశరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం జీడీకే ఓసీపీ-5, 11ఇంక్లైన్‌లలో జరిగిన పూజా కార్యక్రమం, బోనాల ఊరేగింపు, అన్నదానం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, నాయకులు మాదన మహేష్, రంగు శ్రీను, పాల్గొన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఏపిఏ డివిజన్ పరిధిలోని ఏఎల్‌పిలో ఏర్పాటు చేసిన దుర్గామాత శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించారు. అడ్రియాల ప్రాజెక్టులో జరిగిన కార్యక్రమాల్లో ఆర్జీ-3,ఏపిఏ జీఎంలు సుధాకర్‌రావు, నాగేశ్వర్‌రావుల దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అధికారులు యాదయ్య, బండి సత్యనారయణ, జనార్ధన్, సుదర్శనం, పెంచలయ్య, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జల దిగ్బంధంలో ఓసీపీ-2 మ్యాన్ వే కార్యాలయం



రామగిరి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షం కారణంగా ఓసిపి-2 ప్రాజెక్టు జలమయంగా మారింది. శుక్ర వారం ఉదయం మ్యాన్‌వేతోపాటు కార్యాలయాల్లో మోకాళ్ల వరకు నీరు చేరింది. ఫర్నీచర్‌తో పాటు రికార్డులు నీటిలో మునిగాయి. శుక్రవారం విధులకు హాజరైన కార్మికులు ప్రాజెక్టు చెక్‌పోస్టు వద్దే నిలిచిపోయారు. ప్రాజెక్టు మ్యాన్‌వేలోకి వరద నీరు చేరకుండా చర్యలు చేపట్టాలని కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.